సులభంగా చేపల వేట

- సాంకేతికతను అందిపుచ్చుకుంటున్న మత్స్యకారులు
- మత్స్య సంపద అన్వేషణలో జీపీఎస్, ఎకో సౌండ్ సిస్టం వినియోగం
- ఆధునిక సాంకేతికతతో మత్స్యకారుల జీవితాల్లో మార్పు



చింతపల్లి తీరంలో ఆధునిక పడవలు

పూసపాటిరేగ: సముద్రమే సర్వస్వంగా జీవిస్తున్న మత్స్యకారులు ఆధునిక సాంకేతికత వైపు అడుగులు వేస్తున్నారు. భారీ వలలతో సాగర మధనం చేసినా చేపలు చిక్కక ఉసూరుమంటూ వెనుదిరిగే పరిస్థితులు నుంచి బయటపడుతున్నారు. సాంకేతికతతో సులభంగా చేపలను ఒడిసి పడుతున్నారు. కెమెరాలు, జీపీఎస్‌లు, ఎకో సౌండ్ సిస్టమ్‌ను ఉపయోగిస్తూ సముద్ర గర్భంలోని మత్స్య సంపదను వెలికితీస్తున్నారు. విజయనగరం జిల్లాలో పూసపాటిరేగ, భోగాపురం మండలాల పరిధిలో 27 కిలోమీటర్ల మేర సముద్ర తీరం ఉంది. తీరం వెంబడి 19 మత్స్యకార గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల పరిధిలో సుమారు 21 వేల మంది మత్స్యకారులు జీవిస్తున్నారు. అందులో సుమారు 10 వేలు మంది చేపల వేటే జీవనాధారంగా బతుకుతున్నారు. రెండు మండలాల పరిధిలో 250 సాంప్రదాయ బోట్లు, 550 వరకు ఇంజిన్ బోట్ల సహాయంతో మత్స్యకారులు వేటను సాగిస్తున్నారు.

ఎకో ఫిష్ ఫైండర్ సాయంతో..

సముంద్రంలోకి వేటకు వెళ్లిన మత్యకారులకు ఒక్కోసారి చేపలు దొరకక ఖాళీ వలలతో తిరిగి రావాల్సిన పరిస్థితి గతంలో ఉండేది. చేపల వేట కోసం రోజుల తరబడి సముంద్రంలోనే గడపాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు సాంకేతికత సాయంతో మత్యకారులు సులభంగా వేట సాగిస్తున్నారు. ప్రస్తుతం పెద్ద బోట్లు, కొన్ని పడవలలో జీపీఎస్, ఎకో సౌండ్ ఫిష్ ఫైండర్ పరికరాలను ఉపయోగించి చేపలను సులభంగా పట్టుకుంటున్నారు. ఇందులో భాగంగా బోటు కిందవైపు కెమెరాలు అమరుస్తారు. కెమెరాను అనుసంధానిస్తూ బోటు లోపల చిన్న స్క్రీన్‌తో కూడిన కంప్యూటర్ లాంటి పరికరాలు పెడతారు. ఆ బోటు సముద్రంలో బాగా లోపలకు వెళ్లాక ఎకో సౌండ్ ఫిష్ ఫైండర్‌ను ఆన్‌చేస్తారు. సముద్రం లోతు, చేపలు చలనం ఈ ఫిష్ ఫైండర్ పరికరంలో కనిపిస్తుంది. చేపలు గుంపుగా వచ్చినప్పుడు అవి అనుకూలంగా తమకు దొరికేలా శబ్ద తరంగాలు విడుదల చేస్తాయి. వాటి వల్ల చేపలు రివర్స్‌లో వస్తాయి. ఆ చేపలు ఎంత విస్తీర్ణంలో ఉన్నాయో చూసి వల విసురుతారు. దీంతో చేపలు వలకు సులభంగా చిక్కుతాయి.



తిప్పలవలసరేవు సముద్రంలో లంగరు వేసిన పడవలు

మత్స్యకారుల అభివృద్ధికి సాంకేతికత తోడు

ఎకో సౌండ్ ఫిష్ ఫైండర్ ద్వారా చేపలు పట్టే విధానం సులభమైంది. తమిళనాడు, గుజరాత్, ఏపీలో ఎక్కువ మంది మత్స్యకారులు దీన్ని ఉపయోగిస్తున్నారు. సాంకేతిక వైపు మత్స్యకారులు అడుగులు వేసే దిశగా ప్రభుత్వం, మత్స్యశాఖ నూతన పద్ధతులను అందుబాటులోకి తీసుకొస్తోంది. మత్యకారుల జీవనోపాధి, ఆర్థికాభివృద్ధికి సాంకేతికత ఎంతగానో ఉపయోగపడుతోంది.

– చాందిని, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి, విజయనగరం

రామతీర్థంలో ప్రత్యేక పూజలు



యాగశాలలో సుందరాకాండ హవనం జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: శ్రావణమాసం సందర్భంగా పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీసీతారామస్వామి దేవస్థానంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున స్వామికి ప్రాతఃకాలార్చన, బాలభోగం చేపట్టిన తరువాత యాగశాలలో సుందరాకాండ హవనాన్ని నిర్వహించారు. అనంతరం వెండి మంటపం వద్ద సీతారామస్వామిని పట్టువస్త్రాలతో సుందంగా అలంకరించి నిత్య కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా జరిపించారు. స్వామికి తలంబ్రాల సేవ చేసి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. శ్రావణమాసం కావడంతో ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. విఖనస జయంతి సందర్భంగా సోమవారం విశేష పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు సాయిరామాచార్యులు తెలిపారు.

సోదర భావానికి ప్రతీక రక్షాబంధన్



విజయనగరం టౌన్: జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుకు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీ



పూసపాటిరేగలో రాఖీల విక్రయాలు

పూసపాటిరేగ: సోదర భావానికి ప్రతీకగా నిర్వహించుకునే పండగ రక్షాబంధన్. రక్త సంబంధీకులు లేకపోయినా మనకోసం నిలబడే ఆప్తుల్ని సమాజం అందిస్తుంది. అలాంటి వారికి రాఖీ కట్టి సోదర భావాన్ని పెంపొందించుకోవడానికి రాఖీ పౌర్ణమి మంచి సందర్భం. అన్నయ్య, తమ్ముడు, అక్క, చెల్లి నేనున్నానంటూ రక్షగా నిలిచే ప్రతి ఒక్కరూ సోదర సమానమే. అందుకే వీరి అనుబంధానికి ప్రతీకగా శ్రావణ మాసంలో పౌర్ణమి నాడు రక్షాబంధన్ పండగ జరుపుకుంటారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా మార్కెట్లో రాఖీల విక్రయాలు జోరందుకున్నాయి. విభిన్న ఆకృతులతో చూడగానే ఆకట్టుకుంటున్నాయి. దుకాణాలతో పాటు ఆన్‌లైన్‌లో కూడా రాఖీ విక్రయాలు బాగా పెరిగాయి.

బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో..

విజయనగరం టౌన్: జిల్లా కేంద్రంలో బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో రాఖీ పౌర్ణమి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రజాపిత బ్రహ్మ కుమారీస్ జిల్లా ఇన్‌చార్జ్ బీకే అన్నపూర్ణ రాఖీ పౌర్ణమి విశిష్టతను వివరించారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమారీలు ప్రేమసమాజం, వృద్ధాశ్రమం, బధిరుల పాఠశాలలో ఉన్నవారితో పాటు పలువురు ప్రజాప్రతినిధులకు రాఖీలు కట్టారు. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుకు, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మికి, జిల్లా రెవెన్యూ అధికారి, జేసీకి రాఖీ కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

రక్తదానం ప్రాణదానం



రక్తదానం చేస్తున్న దాతలు

గంట్యాడ: రక్తదానం ప్రాణదానమని ఎంఆర్ కళాశాల ఎన్‌సీసీ అధికారి కళ్యాణ్ అశోక్ అన్నారు. జరజాపుపేట సాధన యువజన సంఘం ఆధ్వర్యంలో స్థానిక రెడ్ క్రాస్ సొసైటీలో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మనిషి మాత్రమే ఆపదలో ఉన్న సాటిమనిషికి రక్తం దానం చేసి ప్రాణాలు కాపాడగలడన్నారు. రక్త నిల్వల కొరత కారణంగా రోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రక్త నిల్వల కొరత తీర్చేందుకు రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరు ఏడాదికి నాలుగు సార్లు రక్తదానం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో సాధన యువజన సంఘం అధ్యక్షుడు దుర్గాప్రసాద్, పసుపర్తి వెంకటరమణ, మద్దిల రాంబాబు, తాలాడ రాంబాబు, రెడ్ క్రాస్ సొసైటీ పీఆర్‌ఓ ఎం.రాము తదితరులు పాల్గొన్నారు.

నేడు సహస్ర కుంకుమార్చన

నెల్లిమర్ల రూరల్: మండలంలోని పెదబూరాడపేటలో పురాతన బాలాత్రిపురసుందరీ దేవి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అర్చకుడు వెంకటశర్మ ఆదివారం తెలిపారు. శ్రావణ పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి లలితా సహస్ర కుంకుమార్చన, అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.

ఆక్రమణల తొలగింపు



కాలువపై ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

రాజాం సిటీ: పట్టణంలోని మాధవబజార్‌లోని కాలువపై ఉన్న ఆక్రమణలను మున్సిపల్ అధికారులు ఆదివారం తొలగించారు. అక్కడి దుకాణదారులంతా కాలువపై ఇష్టారాజ్యంగా కట్టడాలు నిర్మించారు. దీంతో కాలువలోని చెత్త తీయడానికి వీలులేని పరిస్థితి నెలకొంది. ఫలితంగా కాలువలోని మురుగు అంతా రోడ్డుపై ప్రవహిస్తుండగా, అటువైపుగా వెళ్తున్న వారంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదే విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో సంబంధిత షాపుల యజమానులతో చర్చించి, ఆక్రమణల తొలగించేందుకు చర్యలు చేపట్టారు. కాలువపై అక్రమంగా ఎటువంటి కట్టడాలు కట్టినా కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు హెచ్చరించారు.

ఆదినారాయణ స్మారక కళాపీఠం ప్రారంభం



ఘంటసాల స్మారక కళాపీఠం వ్యవస్థాపకుడు భీష్మారావు దంపతులను సత్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

విజయనగరం టౌన్: స్థానిక గురజాడ కళాభారతి ఆడిటోరియం ఆవరణలో ఆదివారం ఆదినారాయణ స్మారక కళాపీఠం ప్రారంభోత్సవంతో పాటు గంటా లక్ష్మి సినీ ఆర్కెస్ట్రా ప్రథమ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 12 గంటల పాటు నిర్విరామంగా నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆద్యంతం ఆహుతులను అలరించింది. కళాపీఠం వ్యవస్థాపకురాలు గంటా లక్ష్మి ఆధ్వర్యంలో ఘంటసాల స్మారక కళాపీఠం వ్యవస్థాపకులు ఎం.భీష్మారావు, అరుణ దంపతులను, మహారాజా ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ బురిడి అనూరాధా పరశురామ్ దంపతులను, గురువు కంది పాపాయమ్మలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాపుగంటి ప్రకాష్, భోగరాజు సూర్యలక్ష్మి, పంపాన ప్రకాష్, కానుకల కేశవరావు, పి.విజయలక్ష్మి, బంగారు సూరి, ఎస్.మూర్తి, రామకృష్ణ, తిరుపతిరావు, గంటా మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక చేయూత



విద్యార్థికి ఆర్థిక సాయం చేస్తున్న చారిటీ గ్రూప్ ప్రతినిధులు

విజయనగరం: నేటి విద్యార్థులే రేపటి పౌరులని, వారిని ఉన్నత విద్యావంతులుగా, మంచి పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని జిల్లా ఆర్యవైశ్య మిత్రుల చారిటీ గ్రూప్ అధ్యక్షుడు ఆలవెల్లి శేఖర్ అన్నారు. నగరంలోని పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయం వద్ద ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. క్రమశిక్షణ, కార్యసిద్ధి కలిగిన రోజున విద్యార్థులు సత్ఫలితాలు సాధిస్తారన్నారు. కార్యదర్శి డిమ్స్ రాజు మాట్లాడుతూ.. దాతల సహకారంతో గ్రూపు ద్వారా పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఇంటర్మీడియట్ చదువుతున్న పూసర్ల మనోజ్ కుమార్‌కు రూ.31 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో కోశాధికారి సముద్రాల నాగరాజు, మాచర్ల చంద్రశేఖర్ గుప్తా, కాపుగంటి రవి, పెంటపాటి కామరాజు తదితరులు పాల్గొన్నారు.

సంస్కరణలతో పిల్లలు విద్యకు దూరం

బొబ్బిలి రూరల్: విద్యావిధానంలో తీసుకువచ్చిన పలు సంస్కరణలతో విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు వి.విజయగౌరి అన్నారు. మండలంలోని నిమ్మలపాడు గిరిజన గ్రామంలో యూటీఎఫ్ బృందం ఆదివారం పర్యటించింది. తొలుత గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించి, అక్కడి 1, 2వ తరగతుల విద్యార్థుల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. గతంలో ఇక్కడ 3, 4, 5 తరగతులు ఉండేవని, ప్రస్తుతం ఆ తరగతులు కొనసాగడం లేదన్నారు. దీంతో 3, 4, 5వ తరగతుల విద్యార్థులు మూడు కిలోమీటర్ల దూరం వెళ్లి, చదువుకోవాల్సి వస్తుందన్నారు. పాఠశాలకు వెళ్లిన విద్యార్థులు మళ్లీ ఇంటికి వచ్చే వరకు వారి కోసం తల్లిదండ్రులు వేచిచూస్తున్నారు. ఇక్కడి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, అదనపు తరగతులను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. లేకపోతే చదువు భారం కారణంగా కొంతమంది చదువు మానివేసే అవకాశం ఉందన్నారు. సర్పంచ్ వెళంగిణి మాట్లాడుతూ ఇదే సమస్యను అధికారులకు తెలియజేసినా పట్టించుకోలేదన్నారు. గతంలో ఇదే గ్రామంలో 200 మంది పిల్లల వరకు చదువుకునేవారని, ఇక్కడే హాస్టల్ కూడా ఉండేదని, దానిని మూసివేయడంతో చాలామంది పిల్లలు విద్యకు దూరమయ్యారని తెలిపారు. 3, 4, 5 తరగతుల పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, బ్యాగులు, క్రీడాసామగ్రి అందజేశారు. కార్యక్రమంలో మహేష్, శ్రీనివాస్, కృష్ణదాస్ తదితరులు పాల్గొన్నారు.

● నగరంలో భారీ వర్షం



రాజీవ్‌క్రీడా ప్రాంగణం రోడ్డులో వర్షపునీటిలో వాహనాలు

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- స్తంభించిన రాకపోకలు
- నిలిచిన విద్యుత్ సరఫరా

విజయనగరం: జిల్లా కేంద్రంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి భానుడి ప్రతాపంతో తీవ్ర ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అయిన పట్టణవాసులు సాయంత్రం కురిసిన వర్షంతో కాసింత ఉపశమనం పొందారు. సుమారు గంటన్నర పాటు కురిసిన వర్షానికి నగరంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. భారీ ఉరుములు, మెరుపులు సంభవించడంతో నగరవాసులు భీతిల్లిపోయారు. కార్పొరేషన్ కార్యాలయం జంక్షన్‌లో భారీగా వరద నీరు చేరడంతో ఆ ప్రాంతంలో చిరువ్యాపారాలు చేసుకునే వారి తోపుడు బళ్లు నీటమునిగాయి. అటుగా రాకపోకలు సాగించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అదేవిధంగా నగరంలోని భగవాన్‌నగర్, ధర్మపురి రోడ్, రైల్వే స్టేషన్ రోడ్, వైఎస్సార్‌నగర్, తోటపాలెం, గూడ్స్‌షెడ్ రోడ్డులో రైల్వే ఓవర్ బ్రిడ్జి ప్రాంతాల్లో వరద నీరు చేరటంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షం నేపథ్యంలో విద్యుత్‌శాఖ అధికారులు సుమారు రెండు గంటల పాటు సరఫరాను నిలిపివేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి సరైన వర్షాలు లేక ఎండిపోతున్న పంటలకు ఈ వర్షంతో జీవం వస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నెల్లిమర్లలో..

నెల్లిమర్ల రూరల్: మండల వ్యాప్తంగా ఆదివారం సాయంత్రం మోస్తారు వర్షం కురిసింది. ఉదయం నుంచి వేసవిని తలపించేలా ఎండ, ఉక్కపోతతో ఇబ్బంది పడిన ప్రజలు సాయంత్రం కురిసిన వర్షంతో ఊరట పొందారు. రామతీర్థంలో గుంతల్లో వర్షం నీరు చేరడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. ఆశించిన స్థాయిలో వర్షం కురవలేదని, మరో నాలుగు గట్టి వర్షాలు పడితే దమ్ములు పూర్తి చేసుకోవచ్చని అన్నదాతలు ఆశాభావం వ్యక్తం చేశారు.



నీటిలో చిక్కుకున్న తోపుడు బండి



గంటస్తంభం రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు



వర్షపు నీటిలో వాహనదారుడి పాట్లు



గంటస్తంభం రోడ్డులో జోరువానలో వాహనాల రాకపోకలు



వర్షపు నీటిలో ఆటో

క్లుప్తంగా

విద్యాసంస్థలపై చర్యలకు డిమాండ్



మాట్లాడుతున్న గణేష్

విజయనగరం ఫోర్ట్: సెలవు దినాల్లో తరగతులు నిర్వహించే విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు సుంకరి గణేష్ అన్నారు. ఆదివారం విజయనగరంలో తరగతులు నిర్వహిస్తున్న పలు జూనియర్ కళాశాలలు, విద్యాసంస్థల నుంచి విద్యార్థులను బయటకు పంపించేశారు. నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహించే విద్యా సంస్థలపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌యూఐ నేతలు శ్రీనివాస్, సన్యాసినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి

విజయనగరం ఫూల్‌బాగ్: కోల్‌కతాలోని ఆర్జేకర్ మెడికల్ కళాశాలలో ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం చేసి, హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని జేవీవీ సమతా కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. సమతా రాష్ట్ర కన్వీనర్ నిర్మల అధ్యక్షతన ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేవీవీ మహిళా నాయకురాలు డాక్టర్ సన్యాసమ్మ మాట్లాడుతూ.. కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై సామూహిక అత్యాచారం, హత్య ఘటనను తీవ్రంగా ఖండించారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేంతవరకు జేవీవీ పోరాటం చేస్తుందన్నారు. ఇటీవల దేశంలో వైద్యులపై దాడి ఘటనలు రోజురోజుకి పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యులకు రక్షణ కల్పించేలా ప్రభుత్వాలు పటిష్ట చట్టాలు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను బాధ్యత గల పౌరులుగా తీర్చిదిద్దాలని, ఉపాధ్యాయులు విద్యార్థులకు సమాజంపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు వి.లక్ష్మి, కరుణ, వెంకటరావు, రాజగోపాల్, రమేష్‌రాజా, సాహితి స్రవంతి నాయకులు దివాకర్, చంద్రిక రాణీ, తదితరులు పాల్గొన్నారు.

విరాళాల సేకరణ



మాట్లాడుతున్న రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు లక్షుంనాయుడు

బొబ్బిలి: కేరళలోని వయనాడ్ వరద బాధితుల కోసం స్థానిక పట్టణంలో విరాళాల సేకరణ ఆదివారం చేపట్టారు. రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేమిరెడ్డి లక్షుంనాయుడు, పి.ఈశ్వరరావు, చుక్క సన్యాసిరావు, రాంబార్కి తిరుపతిరావు, కూర్మినాయుడు, అప్పారావు, శంకరరావు కలిసి దాతలు ఇచ్చిన సొమ్మును పోగుచేయగా రూ.5 వేలు సమకూరిందన్నారు. ఈ నగదును కలెక్టర్ అంబేడ్కర్ చేతులమీదుగా కేరళ పంపించనున్నట్లు తెలిపారు.


రక్తదానంపై అపోహలు వీడాలి



రక్తదానం చేస్తున్న రూరల్ సీఐ ఉపేంద్ర, తదితరులు

రాజాం సిటీ: రక్తదానంపై నెలకొన్న అపోహలు విడనాడాలని రాజాం రూరల్ సీఐ హెచ్.ఉపేంద్ర అన్నారు. ఆదివారం స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో సినీహీరో మెగాస్టార్ చిరంజీవి అభిమానులు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి, రక్తదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరోగ్యవంతులైన యువతీ,యువకులంతా ప్రతీ మూడు నెలలకోసారి రక్తదానం చేయొచ్చని తెలిపారు. రక్తదానం చేస్తే సన్నబడిపోతాం, ఆరోగ్యం క్షీణిస్తుందన్న వాటిని నమ్మవద్దన్నారు. రక్తం దానం చేస్తే ఆరోగ్యమే తప్ప అనర్థం లేదన్నారు. 18 ఏళ్లు నిండిన యువకులు రక్తదానానికి ముందుకురావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, పెంకి చైతన్యకుమార్, చిరంజీవి అభిమానులు గోక కొండలరావు, కె.జనార్దన, బి.రమణ, వి.శ్రీనివాసరావు, జగదీష్, త్రినాద్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సుదర్శన హోమం



హోమం చేస్తున్న భక్తులు

గరుగుబిల్లి: స్థానిక షిర్డీసాయిబాబా మందిరంలో సుదర్శన హోమం ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, కాకడహారతి, అభిషేకాలు పూజల అనంతరం ఆలయ ప్రాంగణంలో వీరఘట్టం ప్రాంతానికి చెందిన ప్రముఖ యజ్ఞకర్త ఎస్‌వీఎల్ఎన్ శర్మయాజీ సహకారంతో అర్చకులు సత్తె నరసింహాచార్యులు భక్తులతో హోమం జరిపించారు. ఈ హోమం చేయడం ద్వారా అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని అర్చకులు తెలిపారు. మధ్యాహ్నం దాతల సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు.